# పరిష్కారాలు

''ఏంరా అన్నయ్యా, నీకు జీతం ఎప్పుడొస్తుందేమిటి?'' అని అడిగింది - చెల్లెలు విజయ - రాఘవరావును ఆవేళ ఆఫీసు నుంచి రాగానే.

''నీ కెందుకు?'' అన్నాడు రాఘవరావు టెక్కుగా. సరాసరి తనగదిలోకెళ్ళి కుర్చీలో కూర్చోబడ్డాడు: విజయ కూడా వెళ్ళింది '' ఎందుకంటా వేమిటిరా, నాకో ఐదురూపాయలు ఇవ్వు. ఓ రవిక గుడ్డ కొనుక్కుంటాను. మా అన్నయ్య ఇచ్చాడని అందరికీ చెప్పుకుంటాను!'' అన్నది విజయ.

''ఏడ్చినట్టేవుంది. జీతం రావటంతోటే ముడుపుకట్టి అమ్మకు తెచ్చి ఇస్తాను. అమ్మ ఇష్టం!'' అన్నాడు రాఘవరావు.

''మిగతా అంతా యిచ్చెయ్యరా! ఒక్క రెండంటే రెండు రూపాయలుమాత్రం ఇవ్వు, చాలు. గాజులేనా తొడిగించుకుంటారా!'' అన్నది చెల్లెలు బతిమాలుతూ.

''ఏం మాట్లాడకూడదు! అమ్మకిస్తానన్నాను. అమ్మకే ఇచ్చేస్తాను. అంతే'' అనేశాడు రాఘవరావు. ''కోప్పడకుమరి'' అని గూడా అన్నాడు.

''కోపం ఎందుకేమిటి? బుద్ధిమంతుడివి గనక జీతం తెచ్చి అమ్మకిస్తానంటున్నావు!'' అంటూ మూతితిప్పి వెక్కిరించి లోపలికి పోబోయింది - ఇంకా రెండు మూడు నెలలకు కాపరాని కెళ్ళవల్సినచెల్లెలు. ఈ సంభాషణంతా వింటూనే తల్లి సుబ్బమ్మగారొచ్చింది యింతలో.

''ఏమిటిరా అన్నా చెల్లెలు తర్కం? పని చేసి చేసి వచ్చాడుగదా, వాడికి కాఫీ తెచ్చిద్దాం అన్నాలేకుండా ఏమిటే వాడితో నీకుతర్కం?'' అని కోప్పడిందామె కూతుర్ని.

''వొదిన ఏంచేస్తోందేమిటి? ఆవిడ ఇవ్వగూడదూ?'' అన్నది విజయ లోపలికివెళ్తూ.

''అమ్మా, జీతం ఇవ్వగానే తెచ్చి ఇచ్చేస్తాను. నువు ఏం చేసుకున్నాసరే!'' అన్నాడు కుమారుడు.

''నాకెందుకురా డబ్బొి దస్కమూను? నాకు గంగానమ్మ మొక్కొకటివుంది. అది తీర్చుకోవాలి; అంతే'' అన్నది సుబ్బమ్మగారు

''దేనికీ మొక్కులు?'' అన్నాడు రాఘవరావు.

''ఏముంది? నీకు ఉద్యోగం ఐతే, నీ మొదటిజీతం అలాగే ముడుపుకట్టి చెల్లిస్తాను అని మొక్కుకున్నారా... అదీ!'' అన్నది తల్లి.

''ఉం....'' అన్నాడు కొడుకు.

ఇంతలో తండ్రికూడా వొచ్చాడు ఆఫీసునుంచి, క్లబ్‌కి పోయి, కాస్త కాలక్షేపంచేసి. '' ఏమిట్రా ఏదో, ముడుపూ విడుపూ అంటున్నది మీ అమ్మ!'' అని ప్రశ్నించాడాయన.

''మనగంగానమ్మకండీ, మొక్కుబడి'' అన్నది సుబ్బమ్మగారు.

''అదేమిటి? 'మన' అంటున్నావు? నీ పుట్టింటి కుల దేవత గంగానమ్మగావును. మా కులదైవం ఆదికేశవస్వామి వారు'' అన్నాడు తండ్రి. రాఘవరావు ఏమీ మాట్లాడకుండా నుంచున్నాడు.

''అయితే ఏమంటా రిప్పుడు? ముడుపు చెల్లించక్కర్లేదూ?'' అన్నది సుబ్బమ్మగారు భర్తనుద్దేశించి.

''ఆదికేశవస్వామివార్కి నేనూ మొక్కుకున్నాను మరి, వాడి మొదటిజీతంతో అభిషేకం సహస్రనామార్చనా చేయిస్తానని'' అన్నాడు తండ్రి గోపాలంగారు.

''మా పుట్టిల్లంటేనే మీకు సరిపడదు. మీ ఇష్టం వొచ్చినట్లు చేసుకోండి'' అని సుబ్బమ్మగారు బయలుదేరింది.

రాఘవరావు '' ఏమిటమ్మా, దీనికి ఇంత రగడ. గంగానమ్మకి సగం, ఆదికేశవస్వామికి సగం చొప్పున జీతం పంచేస్తాను సరా'' అన్నాడు సర్దుతూ.

''అదీ కొంతవరకు ధర్మమే మరి'' అన్నాడు గోపాలంగారు.

★ ★ ★

రాఘవరావు ఇంట్లోంచి బైటికివచ్చి రోడ్డుమూలమీద కిల్లీకొట్టుదగ్గరకెళ్ళాడు. ఇంట్లో కాల్చడానికి వీల్లేని సిగిరెట్టు తగలేసి వద్దామని. అక్కడ స్నేహితులున్నారు.

''ఒరే, మనవాడికిజీతం నాలుగోతారీఖున వస్తుందిరా!'' అన్నాడు చిదంబరం, పక్కనేవున్న రామ్మూర్తితోటి.

రామ్మూర్తి రాఘవరావుని ప్రేమగా వీపుమీద దభేలున చరచి, ''అందరూ సంతోషించవలసిన విషయమే మరి!'' అన్నాడు. రాఘవరావుకి కళ్ళుతిరిగాయి. క్రిందపడి పోవడం తరువాయి.

''మీకెందుకోయ్ సంతోషం'' అన్నాడు రామారావు.

''దేనికి అంటావేమిటిరా దేభ్యం. వీడికి ఆఫీసులో జీతం ఇస్తారనుకో, ఆ వేళ ఏంవారం? శనివారంగదూ? వెంటనే మనంఅందరం సరాసరి కృష్ణా కేఫ్‌కి వెళ్ళడం యెవడివోపిక యెంతో అంతా తినటం!'' అన్నాడు రామ్మూర్తి.

చిదంబరం, ''అక్కడినుంచి సరాసరి సినిమాకెళ్ళడం. అంతేనా రాఘవరావు?'' అని ప్రశ్నించాడు.

చిదంబరం పక్కనేవున్న అచ్యుతరావు, '' ఒరే మీ బుద్ధులు ఏమిటి యిలా ఐపోతున్నాయి! మర్నాడు ఆదివారం కదా? ఆవేళ ఉదయమే బయల్దేరి యెక్కడికన్నా పిక్నిక్‌కి పోదాం! సరదాగా వుంటుంది'' అని అందించాడు.

''చాలా సరదాగా వుంటుందిరా! అమరావతికివెళదాం!'' అన్నాడు రామ్మూర్తి. ''అచ్యుతరావు యెప్పుడూ తెలివిగలవాడులే'' అని గూడా అన్నాడు.

రాఘవరావును వాళ్ళసలు మాట్లాడనివ్వనేలేదు. రాఘవరావు వాళ్ళతో ''సరే'' ''సరే'' అని ఎలాగో బైటపడి ఇల్లు జేరుకున్నాడు. '' ఎందుకు జేరామురా ఈ ఉద్యోగంలో!'' అనిపించిదతనికి.

ఆవేళరాత్రి అతనిభార్య, ''మొదటి జీతం పంపిణీ సక్రమంగా జరిగిందా'' అన్నది పుల్లవిరుపుగా.

''ఏమిటి?'' అన్నాడు రాఘవరావు విరక్తిగా. ''నువ్వే బాకీ అనుకుంటున్నా యింక అడగడానికి'' అన్నాడు.

''నేనెందులో జమలెండి! కానివ్వండి! నోరు మూసుకుని పడివుంటే పోయేదానికి ఎందుకొచ్చిన గొడవ నాకు?'' అన్నదామె.

''అబ్బ! వూరుకోవే. ఇంకా ఆ రూపాయలెట్లావుంటాయో కళ్ళతోనైనా చూడలేదు. అందరూ కలిసి చంపుతున్నారు; ఇదిగో చూడు పిచ్చిదానా! ఎందుకలా ఇదయిపోతావు? నేను సంపాయించేది నీకోసం గాక యింకెవరి కోసం!'' అన్నాడు సముదాయిస్తూ.

★ ★ ★

వాళ్ళమ్మ గంగానమ్మ మొక్కుబడి తీర్చటానికి పూజ, అభిషేకాలకు ఏర్పాట్లుచేస్తోంది. తండ్రి ఆదికేశవస్వామివారి అభిషేకం, అర్చనలకు ఏర్పాట్లుచేసి వచ్చాడు.

స్నేహితులు ప్రయాణ సన్నాహం చేస్తున్నారు.

చెల్లెలు గాజులు తొడుక్కోడానికైనా అన్నయ్య డబ్బు లిస్తాడులే అని సంతోషిస్తోంది.

రాఘవరావు జీతం తీసుకున్న రోజున చల్లగా స్నేహితుల కంటబడకండా తప్పించుకుని ఎటో పోయినాడు.

పొద్దుగూకిన తర్వాత ఇంటికి వచ్చాడు. రావడంతోటే తల్లికి నమస్కరించాడు. అతని చేతిలో సంచీ వున్నది! ''దీర్ఘాయుష్మాన్‌భవ!'' అని దీవించింది తల్లి. ఇంటిల్లిపాదీ ఆశతో చూస్తున్నారు అతనివంక.

''అమ్మా!'' అని ప్రారంభించాడు కొడుకు.

అతనిభార్య వంటింటి గడపే దగ్గిర నుంచుని చూస్తోంది.

రాఘవరావు సంచీలోంచి పెద్దపొట్లంతీసి బైటపెట్టాడు.

''అంతా చిల్లరగా ఇచ్చారా ఏమిటిరా అన్నయ్యా లేక అవన్నీ కరెన్సీనోట్లేనా?'' అన్నది ఆశ్చర్యపడుతూ చెల్లెలు.

''అమ్మా నువ్వు ముత్తైదువుకు పెట్టుకోవాలనుకుంటున్నావు కదూ ఈ మధ్య!'' అంటూ ప్రారంభించాడు సుపుత్రుడు.

''అవునురా'' అన్నది తల్లి.

''ఇదిగో, ఫస్టుక్లాస్ చీరెతెచ్చాను. ఎటుతిరిగీ ముత్తైదువకు పెడ్డామనుకుంటున్నావుగా. మీ కోడలికి పెట్టుకో పై శుక్రవారం!'' అన్నాడు రాఘవరావు చిరునవ్వు నవ్వుతూ. అతని భార్య వంటింట్లోకి పోయింది - నోటికి చెంగు అడ్డం పెట్టుకుని నవ్వుతూ.

''చీరె ఎంతేమిటిరా?'' అన్నది ఉక్రోషం కొద్దీ చెల్లెలు.

''ఏభై రూపాయలు'' అన్నాడు అన్న ఆమెవైపుకు చూడకుండానే - గోడవంక చూస్తూ.

''జీతం సరిపెట్టావు!'' అన్నారు తల్లీ తండ్రి ఒక్కసారే.